

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**దిఖాయీ దియే యూన్ కె బేఖుద్ కియా**

**హమే ఆప్ సే భీ జుదా కర్ చలే!**

'బజార్ (1982) సినిమాలో అయిదు పాటలలో నాలుగు పాటలు గొప్ప ఉర్దూ కవుల రచనల ఆధారంగా రూపొందిన పాటలు. 'సాఘర్ సర్హదీ' రూపొందించిన సినిమాలలో ఉర్దూ కవితలు, గజళ్లు గీతాలయి ప్రాణం పోసుకుంటాయి. సామాన్యుల నాలుకలపై అసామాన్య కవుల కవితలు నడయాడతాయి. శ్రోతల మనస్సులను సాహిత్య సముద్రపుటలల శృంగాలపై తళతళలాడే సూర్యకిరణ కాంతితో పాటు నృత్యం చేయిస్తాయి. అలాంటి పాట 'మీర్ తఖీ మీర్' కవిత ఆధారంగా రూపొందిన 'దిఖాయీ దియే యూన్'

ఉర్దూ కవితలను అత్యద్భుతమైన గీతాలుగా మలచటంలో పేరు పొందిన సంగీత దర్శకుడు ఖయ్యామ్. పాట సాహిత్యం ఉత్తమ స్థాయిలో ఉంటే తప్ప బాణీ కట్టెందుకు ఇష్టపడడు ఖయ్యామ్. ఇతర సంగీత దర్శకులలా బాణీ బంధనాలలో గేయాన్ని ఇరికించే బదులు, స్వేచ్ఛగా రాసిన కవితకు తగ్గ బాణీని సృజించేందుకు ఇష్టపడతాడు ఖయ్యామ్. పాట గురించి ఖయ్యామ్ కు కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. అతనికి పాటలను మృదువుగా పాడాలి. గాయనీ గాయకుల స్వరాలు మార్దవంగా, మెత్తగా ధ్వనించాలి. అందుకే 'హైపిచ్'లో ఉండే లత స్వరం ఆయనకు నచ్చదు. ఆరంభంలో ఆయన లతా మంగేష్కర్ స్వరాన్ని వాడలేదు. నిజానికి, ఖయ్యామ్ లతకు నచ్చలేదు. అతని రికార్డింగ్‌లు చివరి క్షణంలో రద్దయ్యేవి. లేకపోతే సినిమా సంగీత దర్శకుడు మారేవాడు.

1952లో తొలిసారిగా 'ఖయ్యామ్'కు 'ప్యార్‌కె బాతే' సినిమాలో పాడినా, 1966లో 'ఆఖ్రీఖత్' సినిమాలో 'బహారోం, మేరా జీవన్ భీ సంవారో' పాట వారిద్దరి కలయికలో వచ్చిన తొలి హిట్ పాట. అత్యద్భుతమైన పాట. ఆ పాటలో లత స్వరం మామూలు కన్నా భిన్నంగా ఉంటుంది. ఎంతో మృదువుగా, తీయగా, మానవ ప్రపంచానికి కాదు, దేవతల ప్రపంచానికి చెందిన అత్యంత పవిత్రమైన స్వరంలా ధ్వనిస్తుంది లత స్వరం ఆ పాటలో. అయినా సరే, 1978లో

'కభీ కభీ' వరకూ ఖయ్యాం సంగీత దర్శకత్వంలో లత తప్పనిసరి స్వరంగా నిలవలేదు. అంతకుముందు 'శంకర్ హుస్సేన్' సినిమా పాటలు వారిద్దరి నడుమ పెరుగుతున్న అవగాహనను సూచిస్తే 1974లో రికార్డయిన 'రజియా సుల్తాన్' సినిమా పాటలు విడుదల కాకముందే 'సూపర్ డూపర్ హిట్' అయి వారి సంగీత అనుబంధాన్ని స్థిరపరిచాయి. ఆ తరువాత వెంటవెంటనే ఒకదాన్ని మించి మరొక పాట ఇద్దరి కలయికలో రూపొందాయి. సాహిత్య పరంగా ప్రతి ఒక్కటీ అద్వితీయమైన వజ్రం. అలాంటి అద్వితీయమైన వజ్రాలలో అపురూపమైన వజ్రం 'దిఖాయీ దియే యూన్' పాట.

హిందీ సినిమా పాటల రచయితలకొక దిశను ఇచ్చినవాడు 'మీర్ తఖీ మీర్'. తన స్వీయానుభూతులకు సార్వజనీనతను కల్పిస్తూ లోతైన భావనలను అత్యంత సరళమైన పదాలలో వ్యక్త పరుస్తూ పండితులను, పామరులను అలరిస్తూ సాహిత్యంద్వారా స్వర్గపుటంచుల వరకూ సునాయాసంగా చేర్చగల కవిత్వం మీర్ తఖీ మీర్ కవిత్వం. 17 ఏళ్ల వయసులో చంద్రుడి నుండి వెన్నెల రూపంలో దిగి వచ్చిన యువతి ప్రేమలో పడ్డాడు మీర్. ఫలితంగా 'ఖ్వాబ్ – ఓ – ఖయాత్' కవిత రూపొందింది. వెన్నెల అమ్మాయి కలల్లో కలుస్తుంది. ఊహల్లో నిలుస్తుంది. నిజ జీవితంలో లభించదు. అందువల్ల కలిగిన నిరాశ, ఆవేదనలనుంచి మీర్ కవితలు ఉద్భవించాయి. వ్యక్తిగత వేదనలు ఆ కవితల సాంద్రతను పెంచాయి. ఫలితంగా సినిమా పాటలకు 'ప్రేరణ'గా నిలిచాయి మీర్ కవితలు. అలాంటి అద్భుతమైన విలువైన మీర్ గజళ్లలో మేలి ముత్యంలాంటి గజల్ 'దిఖాయీ దియే యూన్'.

'బజార్' సినిమా ముస్లిం యువతులతో పెళ్లి వ్యాపారం ఆధారంగా తీసిన సినిమా. పేద ముస్లిం యువతులను అంగడిలో వస్తువులలా అమ్మేస్తున్నారన్న చేదు సత్యాన్ని హృదయం ద్రవించేలా ప్రదర్శించిన సినిమా అది.

'బజార్' సినిమాలో ఒక కీలకమైన ఘట్టంలో వస్తుందీ పాట. రెండో వివాహానికని వచ్చిన షకీర్‌కు పెళ్లి కుదర్చటం ద్వారా లభించిన డబ్బుతో తాను పెళ్ళి చేసుకుని సుఖంగా ఉండవచ్చని భావిస్తుంది స్మితా పాటిల్ పాత్ర. అమ్మాయిని వెతకటం కోసం హైదరాబాదు వస్తుంది. అక్కడ ఆమెనే ప్రేమిస్తున్న ఆమె తిరస్కరించిన పాత ప్రేమికుడుంటాడు. ఆమె ఏ అమ్మాయినిచ్చి అరబ్బుకు పెళ్లి చేయాలనుకుంటుందో ఆమెకో ప్రేమికుడుంటాడు. అతడిని ప్రేమిస్తున్న అమ్మాయి ఒకామె ఉంటుంది. వీరంతా ఒకచోట కలసిన సందర్భంలో కాబోయే వధువు ఈ పాట పాడుతుంది. పాట పాడుతున్న యువతి వైపు షకీర్ దృష్టి మళ్లుతుంది.

సినిమాలో మూడు చరణాలు వినిపిస్తాయి. పల్లవి 'దిఖాయే దియేయాన్'. నిజానికి మీర్ తఖీ మీర్ రాసిన గజల్‌లో తొమ్మిది చరణాలుంటాయి.

**'దిఖాయీ దియే యాన్ ' అన్నది పల్లవి కూడా కాదు.**

**ఫకీరానా ఆయె సదా కర్ చలే**

**మియాన్ ఖుష్ రహో హం దువా కర్ చలే.**

ఫకీర్‌లాగా వచ్చాను. నీకు శుభం కలగాలని దేవుడిని ప్రార్థిస్తాను.

'మీర్ తఖీ మీర్' రాసిన ఈ గజల్ ప్రేమికుల ఎడబాటును అత్యద్భుతంగా ప్రదర్శిస్తుంది. కొందరు ఈ గజల్ ప్రేమికుల ఎడబాటునే కాదు, భగవంతుడికి దూరమైన భక్తుడి విరహవేదనను ప్రేమికుల ఎడబాటు రూపంలో ప్రదర్శిస్తుందీ గజల్ అంటారు.

'ఇస్లాం'లో దైవానికి స్వరూపం లేదు. దాంతో భగవంతుడిపై ప్రేమను వివరించేందుకు స్త్రీ పురుష ప్రేమ గొప్ప ప్రతీకగా ఎదిగింది. భగవంతుడి మీద భక్తుడికి ఎలాంటి తీవ్రమైన 'ప్రేమ' ఉండాలంటే, లైలాపై మజ్నూకి ఉన్నంత అంటారు. మజ్నూ ఎదురుగా దైవం వచ్చి నిలుచున్నా 'నా లైలా అయితేనే తలతిప్పి ఆ వైపు చూస్తా' అనేంత వెర్రి భక్తి ఉండాలి. ఎలాగైతే మజ్నూకు లైలా తప్ప ప్రపంచంలో ఇంకేమీ కనబడదో, అలాగ భక్తుడికి భగవంతుడు తప్ప ఇతర ధ్యాస ఉండకూడదు. అందుకే లైలా మజ్ను వంటి కల్పిత గాధ ఇంతగా ప్రాచుర్యం పొందింది. అత్యద్భుతమైన ప్రేమగాధగా నిలుస్తోంది.

మీర్ తఖీ మీర్ రాసిన ఈ గజల్‌లో ఒకో పాదం అతి తీవ్రమైన ప్రేమభావనను ప్రదర్శిస్తుంది. ఒక ఫకీర్ అంటే సర్వం త్యజించిన వాడిలా వచ్చాడు. ఆమె ఆనందంగా, సుఖంగా ఉండాలని ప్రార్థిస్తూ వెళ్తున్నాడు. ప్రియుడికి ప్రేయసి ఆనందం, సౌఖ్యం తప్ప మరేమీ అవసరంలేదు. తాను నాశనం అయిపోయినా ఫరవాలేదు, ప్రేయసి సుఖంగా ఉండాలన్నది మాత్రమే అతడి కోరిక. అందుకే పలు హిందీ సినిమా ప్రేమ పాటలలో నేను నాశనమయినా నువ్వు ఆనందంగా ఉండాలి, నీ పెదిమలకు ఎరుపు రంగు అవసరమైతే నా హృదయం కోసి రక్తం ఎరుపు నీ పెదిమలకు అందిస్తాను వంటి భావనలు తీవ్రమైన ప్రేమను వ్యక్తం చేసేందుకు కనిపిస్తాయి. ఇలాంటి భావనలకు 'బీజం' సూఫీ తత్వంలో లభిస్తుంది.

**జో తుఝ్‌బిన్ న జీనే కో కహ్తే థె హం**

**సో ఇస్ అహద్‌కో అబ్ వఫా కర్ చలే.**

నువ్వు లేకుండా నేను బ్రతకలేనని పంతం పట్టాను. దాన్ని నిరూపించేందుకు వెళ్తున్నాను. రెండువైపులా పదునైన కత్తిలాంటి పంక్తులు ఈ గజల్ నిండా ఉంటాయి. ఒకవైపు నుంచి చూస్తే స్త్రీ, పురుష ప్రేమ. మరోవైపు నుంచి భక్తుడు, భగవంతుడి ప్రేమ.

**కోయీ సౌమిదానా కర్తే నిగాహ**

**సో తుం హం సే మూహ్ భీ ఛిపాకర్ చలే.**

నేను నీవైపు నిరాశగా చూద్దామనుకున్నా, నువ్వు ముఖం దాచుకుని నన్ను దాటి వెళ్లిపోయావు

**బహుత్ ఆర్జూ థీ గలికి తెరీ**

**సోయాస్ సే లహూ మే నహా కర్ చలే.**

నీకు సమీపంగా ఉండాలని ఎంతో కోరిక ఉండేది. కానీ నిన్ను వదలి వెళ్లక తప్పటంలేదు. ఆ భావన ఎలా ఉందంటే రక్తంలో స్నానం చేసిన భావనతో వెళ్తున్నాను. 'లహూ మే నహానా' అంటే రక్తంలో స్నానం చేయటం అన్న అర్థం వస్తుంది. కానీ ఇక్కడ ఆ  అర్థాన్ని  తీసుకుంటే అపార్థం అవుతుంది. ఆమెకు సమీపంగా ఉండాలన్న కోరిక తీవ్రంగా ఉంది. కానీ వదలి వెళ్లక తప్పటంలేదు. అలా వదలి వెళ్లాలన్న భావన ఎంత బాధాకరంగా ఉందంటే, శరీరమంతా గాయాలై రక్తమోడుతున్నంత బాధాకరంగా ఉంది. 'యాస్ – ఎ – లహూ' అన్న పదబంధానికి అర్థం, నిరాశ నిస్పృహలో రక్తం ఓడటం. 'సో – యాస్ – ఎ – లహు  మే నహాకర్ చలే' అంటే బాధవల్ల. నిరాశవల్ల కారుతున్న రక్తంలో తడిసి ముద్దవటం అన్నమాట. అంటేనే, ఎంత బాధాకరమో ఆమెను వదలి వెళ్లటం. ఈ పాదంలో 'గలీ' అన్న పదం ఉంది. 'గలీ' అంటే వీధి అని అర్థం. 'బహుత్ ఆర్జూ థీ  గలీకే తెరీ' అంటే 'నీ వీధి  పైన కోరిక ఉంది' అని అర్థం చేసుకుంటే అంతకన్నా అపహాస్యం ఉండదు. ఇక్కడ 'గలీ' అన్న పదానికి, సమీపంగా ఉండటం, సన్నిహితంగా ఉండటం అని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

**దిఖాయీ దియే యూన్ బేఖుద్ కియా**

**హమే ఆప్ సే భీ  జుదా కర్ చలే.**

ఒక్క చూపుతోటే నన్ను మంత్ర ముగ్ధుడిని చేశావు. నేనెవరో, నాకే తెలియకుండా నన్ను నాకు దూరం చేసి వెళ్లిపోయావు.

'అమీర్‌ఖుస్రో' రాసిన 'ఛాప్ తిలక్ సబ్ ఛీనీరే, నైనా మిలాయ్‌కే' అన్న భావన ఇక్కడ మరింత చిక్కగా స్పష్టంగా కనిపిస్తోంది. ఒక్క చూపుతో సర్వం మరిపింపచేసిందట. ఎంతగా అంటే తన నుంచి తననే వేరు చేసేంతగా. తాను అన్న స్పృహ లేనంతగా!

**జబీ సజ్దా  కర్తే హీ కర్తే గయీ,**

**హక్ – ఎ – బందగీ హం అదా కర్ చలే.**

నుదురు నేలకు  తాకించి  ప్రణామం చేస్తూనే ఉన్నాను. ఎంత నిజాయితీగా, తీవ్రంగా ప్రార్థించాలో అంతగా ప్రార్థిస్తూన్నాను .

'జబీ ' అంటే నుదురు. ఇస్లామీయులు నుదురు నేలకు  తాకించి నమస్కారం చేస్తారు . దీన్ని 'సజ్దా' అంటారు. నుదురు నేలకు  తాకి  ప్రణామం చేసింది. అలా చేస్తూనే ఉంది. అంటే ఒక్కసారి వంగి నుదురు నేలకు తాకించి సజ్దా చేసిన ఆమె తిరిగి లేవలేదన్నమాట అలా వొంగి ప్రణామం చేస్తూనే ఉంది.

'చూలే  కదం తౌ క్ని కే నఫిర్ ఆస్మాన్ ఉఠే' ప్రేయసి అందాన్ని వర్ణిస్తూ ప్రియుడు పాడే పాట 'అబ్‌క్యామిసాల్ దూ 'లో  ఒక పాదం ఇది. ఆమె పాదాలు తాకాలని వంగిన అవకాశం మళ్లీ లేవలేదట. కాళ్లు తాకటం అంటే, వంగి కాళ్లకు నమస్కారం చేయటం అన్నమాట.  ఇస్లామీయులు సజ్దా చేస్తారు. అలా సజ్దా చేసేందుకు వంగిన ఆకాశం మళ్లీ లేవలేదట. అలాగే ఆమె సజ్దా చేస్తూనే ఉంది. 'హక్ – ఎ – బందగీ' అంటే పూజ చేసే హక్కు. కానీ ఇక్కడ అలా అర్థం చేసుకుంటే సరైన భావం రాదు. ఆమె సజ్దా ఎందుకు చేస్తూనే ఉందంటే అంత నిజాయితీగా సర్వం అర్పించిన భావనతో ఆమె ధ్యానిస్తోంది. పూజ చేస్తోందన్నమాట. ఎంతగా సజ్దా చేసినా అతడిపై ఆమె భక్తి భావానికి సంతృప్తి కలగటం లేదన్నమాట.

**పరస్తిష్ కియా తక్ కె ఆయె బుత్ తుఝే**

**నజర్ మే సబోం కీ ఖుదా కర్ చలే.**

నేను నిన్ను ఎంతగా ప్రేమించి ధ్యానిస్తున్నానంటే ప్రజలు నిన్ను దేవుడిగా భావించేంతగా. 'పరస్తిష్' అంటే పూజించటం. బుత్ అంటే విగ్రహం. బుత్ పరస్త్ అంటే విగ్రహాన్ని పూజించేవాడు. ఆమె అతడిని ఎంతగా ధ్యానించి పూజించిందంటే, అతడిని దైవవిగ్రహంలా భావించేంతగా. దాంతో ప్రజలు కూడా అతడిని దైవంలా భావించటం ఆరంభించారు. సంక్లిష్టమైన భావాన్ని అతి సరళంగా ప్రదర్శిస్తాయి ఈ పాదాలు.

ఒకరు రోజూ ఒక రాయిని దైవంలా భావించి పసుపు కుంకుమ పెట్టి పూజిస్తున్నారనుకుందాం. అది చూసి ఇతరులు కూడా ఆ రాయిని పవిత్రంగా భావిస్తారు. దైవంలా భావిస్తారు. తాము పూజిస్తారు. దాంతో రాయి విగ్రహం అయిపోతుంది. దైవంగా మన్ననలందుకుంటుంది. ఇక్కడ ఆమె తన ప్రియుడిని అంతగా ఆరాధిస్తోంది. ధ్యానిస్తోంది. పూజిస్తోంది. దాంతో అతడో భగవంతుడి విగ్రహం అయిపోయాడు. అందరూ అతడిని దైవంలా భావిస్తున్నారు.

**గయీ ఉమ్ర్ దర్ బంద్ – ఫికర్ – ఎ – ఘజల్**

**సో ఇస్ ఫన్ కో ఐసా బరా కర్ చలే...**

నేను నా జీవితమంతా గజల్ రచనకే అంకితం చేశాను. తద్వారా కవిత రచన కళ స్థాయిని, విలువను పెంచాను.

ఇది మీర్ తఖీ మీర్ ఆత్మవిశ్వాసం. గజల్ రచన విలువను, స్థాయిని ఆయన పెంచాడన్నమాట. నిజానికి అందరూ అంగీకరించే విషయమే ఇది.

బహదూర్ షాహ జాఫర్ ఆస్థాన కవి హాఖ్ సైతం 'నేను గజల్ రచనలో నా శాయశక్తులు వినియోగించినప్పటికీ మీర్‌లా గజల్ రాయలేకపోయాను. ఆ స్థాయి ఎన్నడూ చేరుకోలేను' అని ప్రకటించాడు. అంత గొప్ప స్థాయి గజల్స్ ను రచించాడన్నమాట మీర్.

**కహే క్యా జో పూఛే కొయీ హం సే మీర్**

**జహాన్ మే తుం ఆయే థే క్యా కర్ చలే.**

నువ్వు భూమి మీద పుట్టి ఏం సాధించావు మీర్, అని ఎవరైనా అడిగితే ఏం చెప్పాలి? అని అడుగుతున్నాడు మీర్.

ఈ ప్రశ్నకు సమాధానం ఇంతకన్నా ముందరి పాదాలలో చెప్తాడు. తన భావాల ప్రదర్శనతో గజల్ స్థాయిని పెంచాడు.

సినీ కళాకారుల గొప్పతనం ఎక్కడ ప్రస్ఫుటమవుతుందంటే, ఈ తొమ్మిది షేర్‌ల నుండి సినిమా సందర్భానికి అవసరమైన నాలుగు షేర్లు ఎంచుకుని, వాటిలో ఒకదాన్ని పల్లవిగా వాడుకుంటూ, మిగతా మూడింటిని, మీర్ రాసిన క్రమంలో కాకుండా, సినిమా సందర్భాన్ని ఉద్దీపితం చేసే క్రమంలో పేర్చటం. 'దిఖాయీ దియే యాన్ 'ను పల్లవిగా ఎంచుకోవటాన్ని 'Master stroke' గా భావించవచ్చు.

ఈ పాట సందర్భంలో, సినిమాలోని కీలమైన పాత్రలన్నీ కనిపిస్తాయి. నజ్మా (స్మితా పాటిల్) పార్టీని ఏర్పాటు చేస్తుంది. ఆమె, అంగడిలో వస్తువుగా అమ్ముడు  పోవటాన్ని వ్యతిరేకించి అఖ్తర్ (భరత్ కపూర్)తో బొంబాయి పారిపోతుంది. కానీ స్థిరమైన ఆదాయం లేకపోవటంతో వారు పెళ్లి చేసుకోరు. షకీర్ (బి.ఆర్ చోప్రా) యువ వధువు కోసం వెతుకుతూంటాడు. అతడికి వధువును చూపిస్తే, లభించే ధనంతో తాము వివాహం చేసుకోవచ్చని నజ్మా, హైదరాబాదు వస్తుంది. అక్కడ ఆమెనే ధ్యానిస్తూ ప్రేమిస్తున్న సలీం (నసరుద్దీన్ షా) ఉంటాడు. పార్టీలో శబ్నం (సుప్రియ పాఠక్) పాట పాడుతూంది. ఆమె సర్జూ (ఫరూఖ్ షేక్)లు ప్రేయసీ ప్రియులు. షబ్నం సోదరి నస్రీన్ (నిశాసింగ్) సర్జూను ప్రేమిస్తూంటుంది. సర్జూ ఆమె వైపు చూసి నవ్వుతూంటాడు. కానీ అతని కళ్లు శబ్నం పైనే ఉంటాయి. ఈ సందర్భంలో పాట వస్తుంది. ఈ పాట అక్కడ ఉన్న వారందరికీ వర్తిస్తుంది. అందుకే కెమేరా అందరినీ చూపిస్తూ తిరుగుతూంటుంది. శబ్నం, సర్జూలు ఒకరివైపొకరు చూసుకోవటం, శబ్నం సిగ్గు పడుతూ, ప్రేమ మాధుర్యాన్ని అనుభవిస్తూ, మధురంగా పాడటం, పాటలో భావాన్ని తమకు అన్వయించుకుంటూ, నజ్మా, సలీంలు ఒకరివైపొకరు చూసుకోవటం, నస్రీన్, సర్జూల చూపులు, నవ్వులూ.. పాట అర్థాన్ని మరింత స్పష్టం చేయటమే కాదు, భావాన్ని శోభాయమానం చేస్తాయి. మానవ మనస్సులలోని భావాలను, బలహీనతలను, ప్రేమ మాధుర్యాన్ని, అందులోని అలౌకిక సౌఖ్యాన్ని, అందమైన ఉద్విగ్నతలను, భరించలేని విషాదాలను ప్రేక్షకుడి మనస్సు గ్రహించేట్టు చేస్తుంది పాట చిత్రీకరణ. పాట ప్రేక్షకుడి మనస్సులోని విషాద భావనలు  పెల్లుబికేట్టు ఎప్పుడు చేస్తుందంటే, నస్రీన్, సర్జూలు ఒకరివైపొకరు చూసి నవ్వుకుంటూంటే వారిద్దరి నడుమ ప్రేమ ఉందని నజ్మా భావించటం, పాట పాడుతున్న శబ్నం వైపు తమకంగా, లైంగిక భావనతో షకీర్ చూస్తూంటే, అతడికి శబ్నం పట్ల ఉన్న భావనలు గ్రహించిన సలీం, శబ్నం సర్జూల  ప్రేమ సంగతి తెలియటం వల్ల జరగబోయే అనర్థాన్ని గ్రహించి భయపడటం, బాధపడటం, అసహ్యించుకోవటం అర్థం చేసుకున్న ప్రేక్షకుడు సైతం

పొంచి ఉన్న విషాదానికి నాంది ప్రస్తావనలాంటి సందర్భాన్ని గ్రహించినప్పుడు, విషాద భావన, ప్రపంచంలోని అన్యాయం పట్ల ప్రేక్షకుడి మనస్సులో క్రోధం కలిగినప్పుడు. ఎందుకంటే విధిముందు మనిషి నిస్సహాయుడు. ఏ అన్యాయాన్ని వ్యతిరేకించి నజ్మా అఖ్తర్‌తో పారిపోయిందో, ఇప్పుడు ఆ అన్యాయం జరగటంలో ఆమె ప్రధాన పాత్ర వహిస్తోంది. జరగబోయే అనర్థాన్ని మనస్సు గ్రహించేట్టు చేస్తూ సాగే ఈ పాట చిత్రీకరణ మరుపురాని రీతిలో సాగుతుంది.

పాటలో షేర్లను ఈ సందర్భంలో పొంగి పొర్లే ప్రేమ భావనతో పాటు జరగబోయే అనర్థాన్ని సూచించే క్రమంలో అమర్చటం పాట ప్రభావాన్ని ఇనుమడింపచేస్తుంది. సందర్భాన్ని మరుపురానిదిగా మలుస్తుంది.

'దిఖాయీ దియే యాన్' అంటూ పాటను ఆరంభిస్తూ, సుప్రియా పాఠక్ పాత్ర ఒక్కసారి కళ్లెత్తి సజ్జావైపు చూసి కళ్లు దించుకోవటం, సిగ్గుతో తలవంచుకుని పాడటం. అద్భుతం అనిపిస్తుంది. 'ఎందుకంటే, ఒక్క చూపుతో నన్ను మైమరపింపచేసి నానుంచి నన్ను వేరు చేశావు' అనబోతూ 'ఒక్క చూపుతో' అని అతని వైపు చూడటం సమ్మోహనంగా అనిపిస్తుంది. మొదటి పాదం పూర్తయేసరికి తెరపై పాత్రలన్నీ కనిపిస్తాయి. అందరి సంబంధాలు, అనుబంధాలు అర్థమైపోతాయి.

'జబీ సజ్ద' మొదటి చరణం ఆమె సజ్దా చేస్తున్నది ఎదురుగా ఉన్న ప్రియుడికి అదీ పూర్తిగా కళ్లెత్తి అతడివైపు చూడకుండా! అద్భుతం అనిపిస్తుంది. చరణానికి ముందు వచ్చే ఇంటర్ల్యూడ్ సంగీతంలో ఎవరెవరు ఎవరివైపు చూస్తున్నారో వారి మనసులో భావాలు తెలిసిపోతాయి. రెండవసారి 'జబీ సజ్ద' అన్నప్పుడు సర్జూ, నస్రీన్లు ఒకరివైపొకరు చూసుకుని నవ్వుతారు. అది నజ్మా చూస్తుంది. 'హక్ – ఎ – బందగీ' నిజాయితీగా పూజించటం, ధ్యానించటం అన్నప్పుడు సలీం నజ్మా వైపు ఆరాధనగా చూడటం, నజ్మా అతడివైపు చూసి సీరియస్‌గా దృష్టి మరల్చటం వారి కథను చెప్తాయి. సలీం ఎంతగా నజ్మాను ప్రేమిస్తున్నాడో, ఆరాధిస్తున్నాడో తెలుస్తుంది. అంటే చరణం 'జబీ సజ్ద'తో ఆరంభించటంవల్ల పాత్రల మనోభావాలను, సంఘర్షణలను,భవిష్యత్తులో జరగబోయే అనర్థానికి కారణమైన నజ్మా అపోహకు కారణాన్ని చూపించే వీలు చిక్కింది. మళ్లీ పల్లవి అందుకునేసరికి నజ్మా, సలీంల నడుమ అఖ్తర్ కనిపిస్తాడు. షకీర్ చూపు శబ్నంపై నిలుస్తుంది. షకీర్, అఖ్తర్‌ల చూపులు కలుస్తాయి. షకీర్‌కు శబ్నం నచ్చిందని అర్థమైపోతుంది. ఇంతలో శబ్నం సర్జూవైపు చూసే చూపులోని అమాయకత్వం, ప్రేమ భావనలు ప్రేక్షకుడిలో బాధను కలిగిస్తాయి. ఎందుకంటే వీరి అమాయక ప్రేమ భగ్నమయ్యేందుకు నాందీ ప్రస్తావన క్షణం క్రితమే జరిగిందని ప్రేక్షకుడు గ్రహించాడు కాబట్టి..

'పరస్తిష్ కియా' అన్నప్పుడు సలీం, నజ్మావైపు, నజ్మా శబ్నం వైపు, నస్రీన్ సర్జు వైపు, సర్జు శబ్నం వైపు చూసే చూపుల్లో, వ్యక్తిని భగవంతుడి విగ్రహం స్థాయికి ఎదిగింపచేసే, ప్రేమ కనిపిస్తుంది. సలీం దృష్టిలో నజ్మా దేవత. నస్రీన్ దృష్టిలో సర్జు దైవం. సర్జు దృష్టిలో శబ్నం దైవం. శబ్నంకు సర్జు దైవం. 'నజర్ మే సబోంకి' అన్నప్పుడు తెరపై పాత్రలన్నీ కనబడటం ఒక చమత్కారం. మళ్లీ 'దిఖాయీ' అన్నప్పుడు తెరపై శబ్నం, నేపథ్యంలో షకీర్‌లు కనబడటం, కెమెరా షకీర్‌ను క్లోజప్పులో చూపటం, అతడి దృష్టి శబ్నం పైనే ఉండటం జరగబోయే దాన్ని మరింత సృష్టించేస్తుంది. అంతలో సలీం కోపంగా షకీర్ వైపు చూడటం. అఖ్తర్ దృష్టి, శబ్నం కళ్లనుంచి జాలువారే వెన్నలవంటి పరిశుభ్రమైన ప్రేమ కిరణాలు. ఆమె వైపు చూస్తున్న అఖ్తర్... అద్భుతమైన చిత్రీకరణ.

'బహుత్ అర్జూ థీ గలీ కీ తెరీ' అన్న చరణంలో తెరపై ఒకేసారి శబ్నం, షకీర్, సర్జూలు కనిపిస్తారు. షకీర్‌కు శబ్నంపై కోరిక, శబ్నంకు, సర్జూకు ఒకరిపై ఒకరికి కోరిక. తెలియకుండానే తెరపై సంఘర్షణ కనిపిస్తుంది. ఉద్విగ్నత కలుగుతుంది. పాట భావం మనస్సును ఝల్లుమనిపిస్తుంది. తరువాత పాదంలో 'రక్తంలో తడిసి స్నానమాడటం' జరగబోయే ఘోరాన్ని హృదయం గ్రహించేట్టు చేస్తుంది. ఎందుకంటే, పెద్దల నిర్ణయాన్నికాదనే ధైర్యం అక్కడ ఎవ్వరికీ లేదు. కాబట్టి షకీర్, శబ్నంపై హక్కు సాధిస్తాడు. కానీ సర్జూకు సన్నిహితం కావాలన్న కోరికతో శబ్నం 'రక్తంతో స్నానమాడుతుంది..' జరిగే భవిష్యత్తును తెలుపుతూ వేదనను, ఉద్విగ్నతను, విధి పట్ల క్రోధాన్ని, ఏమీ చేయలేని నిస్సహాయతపట్ల ఆక్రోశాన్ని కలుగజేస్తుంది. ఈ సమయంలో సలీం క్లోజప్పు చూపిస్తాడు. అతని వదనం మాట్లాడుతుంది. కళ్లు భావాన్ని తెలుపుతాయి. అద్భుతమైన నటన ఇది. 'సో యాసే లహూ ' అన్నప్పుడు శబ్నంను క్లోజప్పులో చూపిస్తూ ఆమె నవ్వటం... ఒళ్లు గగుర్పొడుస్తుంది. ప్రేమకోసం చిరునవ్వుతో ప్రాణత్యాగం చేస్తుందన్న భావన విపరీతమైన వేదన కలిగిస్తుంది. పైగా సుప్రియా పాఠక్ ఎంత అమాయకంగా, అందంగా కనిపిస్తుందంటే, వ్యక్తుల స్వార్థం ఒక నిండు జీవితాన్ని కబళిస్తుందని, ఒక పుష్పం విరిసేలోపలే వాడిపోతుందనీ తీవ్రమైన వేదన కలుగుతుంది. పాట చివరలో 'వీడ్కోలు పలుకుతున్నట్టు, శబ్నం క్లోజప్పుతో ఒక అద్భుతమైన గాథ ట్రాజెడీగా సమాప్తమైన భావనతో గుండె బరువెక్కుతుంది. అది చివరి 'వీడ్కోలు'లా అనిపిస్తుంది.

సినిమా ప్రధానంగా దృశ్యమాధ్యమం. కెమెరా మాట్లాడటం, భావాలు తెలపటం, కథ చెప్పటం వంటివన్నీ ఈ పాట చిత్రీకరణలో చూడవచ్చు. నాయిక ప్రాణత్యాగాన్ని సూచిస్తూ 'సోయాసే లహూ' అన్న చరణాన్ని చివరలో ఉంచటం, కవితా భావాన్ని ఆకళింపు చేసుకుని, అవగాహనతో చేసే చిత్రీకరణ, పాటవుంది కాబట్టి చేసే పాట చిత్రీకరణకూ నడుమ తేడాను స్పష్టం చేస్తుంది.

ఈ పాటను లత పాడిన విధానం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే ఆమె స్వరం అచ్చు సుప్రియ పాఠక్ స్వరూపానికి ధ్వని రూపంలా అనిపిస్తుంది. 'జూదా' దగ్గర ఆమె వేసిన ముర్కీ(గమకం) స్వర్గలోకానుభవాన్నిస్తుంది. ప్రతిపదాన్ని పలికిన తీరు, చిలికిన భావం, అదొక ప్రత్యేక లోకానికి రహదారి. చిత్రీకరణతో సంబంధం లేకుండా పాట వింటే కలిగే భావం అద్వితీయం. చిత్రీకరణ, సినిమాకు, సందర్భానికి పరిమితం. కానీ లతా పాట అనంతమైన అద్భుతమైన సున్నిత భావాల లోకంలో విశృంఖల విహారం చేయిస్తుంది. ఒకోపదం, ఒకో భావం గురించి మాటలకందని భాష. కోటికోటి పేజీల భావాలను రచించవచ్చు. ఎవరికి వారే అనుభవించాల్సిన భావనలివి. మరొకరికి వివరించటం కుదరదు. ఆవిరైపోతాయి.పదాలు దొరకవు. పదాలు కలిగించే అర్థాల పరిమితుల్లో ఛిద్రం అయిపోతాయి. భౌతిక శబ్దాల రూపంలో మలినం అయిపోతాయి. సినిమాకూ, సాహిత్యానికీ ఉన్న అత్యంత సాంద్రమైన సంబంధాన్ని ఈ పాట మనస్సుకు హత్తుకునే రీతిలో ప్రదర్శిస్తుంది. దృశ్యాన్ని సాహిత్యం ఏ రీతిలో ఎంతగా ఇనుమడింప చేస్తుందో దానికి తిరుగులేని తార్కాణం 'బజార్' సినిమాలోని ఈ పాట. కవి హృదయాన్ని గ్రహించి, దృశ్యం ద్వారా దానికి భాష్యం చెప్పటమనే సృజనాత్మక కళాప్రదర్శనకు అత్యుత్తమ ఉదాహరణ ఈ పాట.

చలనచిత్ర కళాకారులకు సాహిత్యంతో సన్నిహిత సంబంధం ఉంటే, ఎంత గొప్ప స్థాయిలో కళాప్రదర్శన సంభవిస్తుందో అందుకు అతి గొప్ప ఉదాహరణ ఈ పాట. అందుకే, ఇతర ఉద్యోగాలకు శిక్షణ తరగతులు నిర్వహించినట్టుగా, సినీ కళాకారులకి సాహిత్య స్పృహనిచ్చే సాహిత్య తరగతులు నిర్వహిస్తేనే, మన సినిమాలు బాగుపడతాయన్న ఆలోచన కలుగుతుంది, ఇలాంటి కవితాత్మకమయిన దృశ్యాలు చూస్తున్నప్పుడు.

**బహుత్ ఆర్జూ థీ గలీ కె తెరీ**

**సొయాసే లహూ మే నహా కర్ చలే...**

(వచ్చేనెల మరిన్ని పాటలతో ..)

Click here to share your comments